క్లుప్తంగా

రూ.25 వేల విరాళం


విరాళం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చిప్పగిరి: మండలంలోని తిమ్మాపురంలో గ్రామ దేవత ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పూజా కార్యక్రమాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామస్తుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు రూ 25 వేల విరాళం అందించారు. ఉత్సవ నిర్వాహకులు లోకనాథ్, హేమంత్, నాగప్ప, శేఖర్, ఓబులేసు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాన్యం కౌలుకు వేలం


బహిరంగ వేలం నిర్వహిస్తున్న దేవాలయ అధికారులు

మద్దికెర: పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి దేవాయలయానికి చెందిన 13 ఎకరాలను మూడేళ్ల పాటు కౌలుకు చేసుకునేందుకు గురువారం దేవాలయ ఆవరణలో చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. గతేడాది రూ.70 వేలకు పోగా ఈఏడాది రూ.91 వేలకు పలికిందని దీంతో ఆలయానికి రూ. 21 వేలు ఆదాయం లభించిందని ఈఓ తెలిపారు. కౌలుదారులు ముందు గుత్త చెల్లించారని చెప్పారు.

విత్తన ఎంపికలో మెలకువలు పాటించాలి

చిప్పగిరి: ఖరీఫ్ నేపథ్యంలో పంటలు సాగుచేసే రైతులు విత్తన ఎంపికలో మెలకువలు పాటించాలని ఏఓ విజయలక్ష్మి మండల రైతులకు సూచించారు. ఆమె గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మాట్లాడుతూ.. లైసెన్స్ కలిగిఉన్న దుకాణంలో మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం రాయితీతో అందించే వేరుశనగ, కంది తదితర విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖరీఫ్ ప్రారంభంలోనే వర్షాలు కురుస్తుండడంతో ఈ ఏడాది పంటలసాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


చిగిళ గంగమ్మ (ఫైల్)

హాలహర్వి: మండలంలోని బిలేహాల్ గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త చిగిళి గంగమ్మ (80) అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న పార్టీ మండల కన్వీనర్ పచ్చారపల్లి రామిరెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.5 వేలు సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతురాలు చిగిళి గంగమ్మ, వారి కుటుంబం వైఎస్సార్‌సీపీని స్థాపించినప్పటి నుంచి పార్టీలో ఉంటు బలోపేతం చేసేందుకు కృషి చేశారన్నారు. టీడీపీ నాయకులు ప్రలోభాలకు గురిచేసినా లొంగలేదన్నారు. అలాంటి వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. పార్టీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ ఉలిగప్ప, నెట్టెప్ప, పరశురామ్ తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు.

ఎల్లార్తి దర్గాలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు


ఎల్లార్తి దర్గాలో స్వామివారి సమాధి

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. దర్గాలకు దర్శనం, మొక్కులు చెల్లించుకోవడానికి జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ తదితర దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక ఫాతెహాల్లో పాల్గొని దేవుళ్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాలు, షిర్డిసాయిబాబా ఆలయాలను భక్తులు దర్శనం చేసుకున్నారు. తీర్థ ప్రసాద పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

అసభ్యకర సందేశాలు పంపితే కఠిన చర్యలు

మద్దికెర: సోషల్ మీడియాలో అసభ్యకరమైన సందేశాలు పంపితే కేసులు నమోదు చేయడమే గాకుండా కఠినచర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ విద్వేష, రెచ్చగొట్టే సందేశాలు పంపితే గ్రూప్ అడ్మినే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఎగ్జిట్‌పోల్ తరువాత ఎటువంటి రెచ్చగొట్టే పోస్టులు పెట్టరాదని సూచించారు. సందేశాలు పంపేటప్పుడు వాస్తవం తెలుసుకోవాలన్నారు. తప్పుడు సమాచారం పంపే వారిని వెంటనే గ్రూపు నుంచి తొలగించాలని చెప్పారు.

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే చర్యలు


కృష్ణగిరి పోలీస్‌స్టేషన్ ఆవరణలో నాయకులతో మాట్లాడుతున్న సీఐ సురేష్‌కుమార్ రెడ్డి

కృష్ణగిరి: సార్వత్రిక ఎన్నికల కౌటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని వెల్దుర్తి సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జూన్ 4న కౌటింగ్ సందర్భంగా అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. గొడవలకు పాల్పడితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత టపాసులు కాల్చడం, ఊరేగింపులు చేయడం లాంటివి చేయరాదని చెప్పారు. నిబంధనలు ఉల్లఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలుకే..

ఆలూరు: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సమయనంతో వ్యవహరించాలని, అల్లర్లకు పాల్పడినా, లేదా తెరచాటు నుంచి గొడవలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిసినా కేసులు నమోదు చేస్తామని ఆలూరు సీఐ బి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానిక పోలీసు సర్కిల్ కార్యాలయం ఆవరణలో గురువారం మండలంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులతో ఆయన సమావేశమయ్యారు. ఉన్నతాధికారులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. ఎస్‌ఐ ఓబులేసు, పోలీసులు, వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

ఏఓ విస్తృత తనిఖీలు


రికార్డులను తనిఖీ చేస్తున్న ఏఓ ఆనంద్‌లోకదళ్

హొళగుంద: స్థానిక కోరమండల్, మన గ్రోమోర్ సెంటర్ నిర్వాహకులు బిల్బుక్‌లు, రిజిష్టర్‌లు, ప్రొవిజన్ సర్టిఫికెట్‌లు సక్రమంగా నిర్వహించకపోవడంతో ఆ షాపుల్లోని రూ.3,83,616 విలువ చేసే వివిధ కంపెనీల పత్తి విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు ఏఓ ఆనంద్‌లోకదళ్ వెల్లడించారు. ఆయన గురువారం స్థానిక మనగ్రోమోర్ సెంటర్, గాదిలింగేశ్వర ట్రేడర్స్ తదితర ఫర్టిలైజర్స్ షాపులను తనిఖీ చేశారు. రికార్డులను, నిల్వ ఉన్న స్టాకు వివరాలను పరిశీలించారు. వివరాలు సక్రమంగా లేని విత్తనాల శ్యాంపిల్లను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అమ్మాలని నిర్వాహకులకు సూచించారు. ఎమ్మార్పీ కన్నా అధిక ధరకు విక్రయించడం, లూజు పత్తి విత్తనాలు, నిషేధిత విత్తనాలు అమ్మితే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. ఏఈఓ విరుపాక్షి వెంట ఉన్నారు.

1,083 మందికి విత్తనాల పంపిణీ

ఆస్పరి: మండలంలో 1083 మంది రైతులకు సబ్సిడీ కింద వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసినట్లు ఏఓ నరేంద్రకుమార్ తెలిపారు. గురువారం ఆస్పరిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని ఆస్పరి, శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, హలిగేర, చిగిళి, బిణిగేరి, బిల్లేకల్లు, ముత్తుకూరు, కైరుప్పల, కారుమంచి, బనవనూరు, ములుగుందం గ్రామాలలో 1083 మంది రైతులకు 900 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ విత్తనాలు అందజేశామన్నారు. మండలానికి 2600 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు పంపగా ఇప్పటివరకు 950 క్వింటాళ్ల వేరుశెనగ విత్తనాలు మంజూరయ్యాయన్నారు. రైతులకు విత్తనాల కొరత లేకుండా చూస్తామని చెప్పారు.

అనుమతులు ఉన్న విత్తనాలనే విక్రయించాలి


వెల్దుర్తిలోని దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ అక్తర్‌బాషా

వెల్దుర్తి(కృష్ణగిరి): అనుమతులు లేని విత్తనాలను రైతులకు అమ్మితే వారిపై విత్తన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి అక్తర్‌బాషా తెలిపారు. వెల్దుర్తి పట్టణంలోని బాలాజీ, సాయిరాం, మన గ్రోమోర్ మందుల షాపులను గురువారం తనిఖీచేసి పలు రికార్డులను పరిశీలించారు. అలాగే ఆయా దుకాణాల్లో వివిధ కంపెనీల పత్తి, కంది, ఆముదం, కురగాయాల విత్తనాలను పరిశీలించి ఐదు రకాల విత్తనాలను నమూనాలను సేకరించి నాణ్యతా ప్రమాణాల నిమిత్తం విత్తన ప్రయోగశాలకు పంపారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులో లాట్ నంబర్‌తో పాటు అన్ని వివరాలు పేర్కొనాలని సూచించారు.

'మధ్యాహ్నం'లో మెనూ పాటించాలి

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ రంగస్వామి తెలిపారు. గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని వంట ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రుచికరమైన భోజనమందించేందుకు నిర్వాహకులు కృషి చేయాలన్నారు. మెనూ పాటించడం లేదని విద్యార్థుల నుంచి ఫిర్యాదులు అందితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు ఇంటర్ మిగులు సీట్లకు కౌన్సెలింగ్

కృష్ణగిరి: మండలంలోని కంబాలపాడు గ్రామంలో నున్న డా.బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ సుజాత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బాలికల విభాగానికి సంబంధించి శుక్రవారం దిన్నెదేవరపాడు పాఠశాలలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నా. ప్రవేశ పరీక్షలో మంచి మార్కులు సాధించి వెయిటింగ్ లిస్టులో పేరు ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆ తర్వాత కూడా సీట్లు మిగిలితే ప్రతిభ అధారంగా భర్తీ చేస్తామని పేర్కొన్నారు.

వైభవంగా కొల్లాపురమ్మ రథోత్సవం


లింగంపల్లిలో కొల్లాపురమ్మ దేవి రథోత్సవం

హొళగుంద: మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో వెలసిన కొల్లాపురమ్మ దేవి రథోత్సవం గురువారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఉత్సవంలో భాగంగా ఉదయం ఆలయంలో దేవికి గంగపూజ, కలశ పూజ, జలాభిషేకాలు, ఆకుపూజ, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అశేష భక్త జనుల మధ్య అమ్మవారి రథోత్సవం వైభవంగా సాగింది. శుక్రవారం ఉత్సవం ముగింపులో భాగంగా ఆలయంలో మహామంగళారతి, ఇతర పూజలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రథోత్సవం కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.


కొల్లాపురమ్మ దేవి

రేపు రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు

మద్దికెర: మండలంలోని ఎడవలి గ్రామం సమీపంలోనున్న పాడు కిష్టాపురం ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని జూన్ 1 వతేదీ శనివారం ఉదయం 8 గంటలకు దేశం , కిలారి ఎద్దుల రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. ప్రతిభ కనబరిచిన వృషభాలకు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు బహుమతిగా అందజేస్తామని చెప్పారు. 1న ఉదయం 8:45 గంటలలోపు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 9502301697 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించాలి


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

దేవనకొండ: గత ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసి నష్టపోయిన ప్రతి రైతుకు పూర్తిస్థాయిలో పంట నష్టపరిహారం నిధులు అందేలా చర్యలు చేపట్టాలని సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి ఎం.నరసారావు, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రాజశేఖర్, ఏపీ రైతుసంఘం మండల కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ, వ్యవసాయశాఖ అధికారికి రైతులతో కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా కరువు ఏర్పడిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించి ఏటా పంట నష్టపరిహారం నిధులను సంబంధిత రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. చాలామంది రైతులకు సంబంధించి బ్యాంకు ఖాతాల వివరాల్లో తప్పుల కారణంగా నష్టపరిహారం అందలేదన్నారు. అర్హులైన రైతులందరికీ పరిహారం అందేలా చూడాలని కోరారు. మండల నాయకులు వీరాంజనేయులు, శ్రీనివాసులు, కోదండ, నరసన్న, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రేపు హనుమాన్ జయంతి వేడుకలు


క్షేత్రగుడి ఆంజనేయస్వామి

హాలహర్వి: మండలంలోని క్షేత్రగుడిలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు పూజారి ప్రహ్లాద తెలిపారు. ఉదయం 8:30 గంటలకు పంచామృతాభిషేకం, 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం, హోమం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం రథోత్సవం, రాత్రి భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రైలు నుంచి జారిపడి యువకుడి దుర్మరణం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అనంతపురం సిటీ: బతుకుదెరువు కోసం బెంగళూరుకు వెళ్లొస్తున్న ఓ యువకుడు ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి మృతిచెందాడు. మృతుడిని కర్నూలు జిల్లా హొళగుంద మండలం నాగరకన్వి గ్రామానికి చెందిన హరిజన నాగప్ప కుమారుడు సురేష్ (20)గా గుర్తించినట్లు అనంతపురం జీఆర్‌పీ ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు. తండ్రి పదేళ్ల క్రితమే చనిపోవడంతో తల్లి, ఇద్దరు తమ్ముళ్ల పోషణ భారం పెద్ద కుమారుడు సురేష్‌పై పడింది. ఇంటర్ వరకు చదువుకున్న సురేష్.. బెంగళూరుకు వెళ్లి ఏదైనా కంపెనీలో కార్మికుడిగా చేరాలనే ఆకాంక్షతో తన స్నేహితుడితో కలసి వెళ్లాడు. గురువారం ఉదయం హంపి ఎక్స్‌ప్రెస్ రైలులోని జనరల్ బోగీలో తిరుగు ప్రయాణమయ్యాడు. రైలు అనంతపురం రామ్‌నగర్ వద్దకు చేరుకోగానే డోర్ వద్ద నిలబడిన సురేష్ అదుపుతప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కీమెన్ గుర్తించి సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి సురేష్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు.

హాస్టల్ వసతికి దరఖాస్తు చేసుకోండి

కౌతాళం: మండల పరిధిలోని నదిచాగి గ్రామంలో తొంటదార్య మఠం వారు నిర్వహిస్తున్న ఉచిత హాస్టల్ వసతి కోసం అర్హులైన పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మఠం పీఠాధిపతి చెన్నబసవేశ్వర, శివయోగి స్వాములు అన్నారు. మఠం ఆధ్వర్యంలో గత 25 సంవత్సరాల నుంచి పేద విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తున్నామన్నారు. ఈ ఏడాది 25 మంది విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు స్వామి వివరించారు. గురువారం హొళగుంద మండలం సుళవాయి, కురువళ్లి గ్రామాల నుంచి విద్యార్థులు వచ్చి దరఖాస్తు చేసుకున్నారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి

తుగ్గలి : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను సమావేశంలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ఉపాధి పనులను సక్రమంగా నిర్వహించడం లేదని జొన్నగిరి సర్పంచ్ ఓబులేసు ప్రస్తావించగా..పనులను సర్పంచ్ ఎప్పుడైనా తనిఖీ చేసుకోవచ్చని, ఏవైనా అక్రమాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకొస్తే విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఏపీఓ రామకృష్ణ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ గోపాల్, వైస్ ఎంపీపీ-2 నాగప్ప, కో ఆప్షన్ సభ్యుడు చాంద్‌బాషా, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్థవంతంగా మండల మీట్


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

దేవనకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం రసవత్తరంగా జరిగింది. ప్రజాప్రతినిధులచే తాగునీరు, సాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు మొదలైన వాటిపై చర్చలు జరిగాయి. గతేడాది కరువు పంట నష్టపరిహారం చాలామంది రైతుల ఖాతాల్లో జమ కాలేదని సభ్యులు లేవనెత్తారు. రైతుల ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాల తప్పిదాల కారణంగా ఖాతాల్లో నగదు జమకాలేదని అగ్రికల్చర్ అధికారులను ప్రశ్నించగా పంట నష్టపరిహారం జమ కాని రైతులు వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో బ్యాంకు ఖాతా, పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లను అందించాలని సూచించారు. వాటిని జేడీ ఆఫీసుకు పంపి అనుమతి లభించిన వెంటనే వారి ఖాతాల్లో నగదు జమవుతుందని చెప్పారు. ఎంపీడీఓ ఇద్రూస్‌బాషా, ఎంపీపీ లక్ష్మీదేవి, ఏఓ సురేష్‌బాబు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యపై విచారణ

దేవనకొండ: మండలంలోని జిల్లెడబుడకల గ్రామంలో గత బుధవారం రైతు హరిశ్చంద్ర ఆత్మహత్య చేసుకున్న విషయంపై విచారణ చేపట్టి జిల్లా ఉన్నతాధికారులకు ప్రిలిమినరీ రిపోర్టు పంపించినట్లు ఏఓ సురేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. హరిశ్చంద్రకు 3.82 ఎకరాల పొలం ఉందని, గతేడాది పత్తి, వేరుశనగ, ఆముదం పంటలను వర్షాధారంపై సాగు చేయగా నష్టాలు చవిచూశాడన్నారు. వ్యవసాయ పెట్టుబడులు, కుటుంబ అవసరాల కోసం రూ.8 లక్షల వరకు అప్పులు చేశాడని తెలిపారు. అప్పులను ఎలా తీర్చాలో తెలియక మధనపడుతూ పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. రైతులెవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని, కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని జీవించాలన్నారు. మరలా పంటలను సాగుచేసే ప్రయత్నం చేయాలని సూచించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం


చికిత్స పొందుతున్న దాదావలిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి

ఆలూరు: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని పార్టీ ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి భరోసా ఇచ్చారు. మండలంలోని హత్తిబెళగల్ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దాదావలి సాహెబ్ పొలంలో ట్రాక్టర్‌తో దన్నుతుండగా కిందపడి గాయాల పాలయ్యారు. కుటుంబసభ్యులు ఆయన్ను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి గురువారం ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న దాదావలిని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదల కోసం పనిచేసే పార్టీ వైఎస్సార్‌సీపీ అని, పార్టీ కోసం పని చేసిన ప్రతిఒక్కరికీ అండగా ఉంటామన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం అని, ప్రజలందరి అభిమానంతో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపడతారని, ఆలూరు ఎమ్మెల్యేగా తాను గెలుపొందడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. పలువురు నాయకులు వెంట ఉన్నారు.

కార్మిక హక్కులను పరిరక్షించుకుందాం

దేవనకొండ: కార్మిక హక్కుల పరిరక్షణకు ఉద్యమించే వేగుచుక్క సీఐటీయూ అని ఆ యూనియన్ మండల కార్యదర్శి అశోక్ అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం దేవనకొండలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యత–పోరాటం నినాదంతో 1970 మే 30న ఏర్పడిన సీఐటీయూ దేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా, కార్మిక హక్కుల పరిరక్షణకు కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, కనీస వేతనం అమలు, సమాన పనికి సమాన వేతనం, శ్రమకు తగ్గ ఫలితం కోసం అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. నాయకులు నాగరాజు, రవీంద్రబాబు, ఏలియా, సుధాకర్, రంగన్న, బండ్లయ్య, మహేష్, రాముడు, ప్రజా సంఘాల నాయకులు మహబూబ్‌బాషా, గాజుల శ్రీనివాసులు, లక్ష్మిరెడ్డి, కె.పి.రాముడు తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద: కార్మికులు, ఉద్యోగుల హక్కుల కొరకు అందరూ సంఘటితంగా ఉద్యమించాలని సీఐటీయూ మండల కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం హొళగుందలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సీఐటీయూ గౌరవాధ్యక్షుడు వెంకటేశ్‌తో కలిసి జెండాను ఆవిష్కరించారు. నాయకులు ఉలిగయ్య, కాళింగ, దస్తగిరి, వెంకటేష్, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు రంగస్వామి రథోత్సవం


కాత్రికిలో వెలసిన రంగస్వామి, వేంకటేశ్వరస్వామి

ఆలూరు: కాత్రికి గ్రామంలో కొలువుదీరిన రంగస్వామి, వేంకటేశ్వర స్వాముల రథోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ హరిశ్చంద్రారెడ్డి, అర్చకులు శ్రీనివాసులు గురువారం తెలిపారు. ఉదయం స్వాముల వారికి గంగపూజ, ఆకు, పుష్ప అభిషేక పూజలు, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చే భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేసినట్లు కమిటీ చైర్మన్ హరిశ్చంద్రారెడ్డి తెలిపారు. రథోత్సవాన్ని తిలకించేందుకు ఆదోని, ఆలూరు, పత్తికొండ, శిరుగుప్ప, బళ్లారి తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానున్నారు. ఈ ఏడాది లక్షలు ఖర్చు చేసి కర్ణాటక రాష్ట్రంలోని కొప్పల్‌లో తయారుచేయించిన నూతన రథాన్ని ఉత్సవాల్లో వినియోగించనున్నారు. రథోత్సవం సందర్భంగా ఆలూరు ఎస్‌ఐ ఓబులేసు బందోబస్తు చర్యలు చేపట్టనున్నారు.

రమణీయం.. లక్ష్మమ్మవ్వ వెండి రథోత్సవం


రథంపై ఆశీనులైన అవ్వవారి ఉత్సవమూర్తి

ఆదోని అర్బన్: భక్తుల ఇలవేల్పు మహాయోగి లక్ష్మమ్మవ్వ 92వ వెండి రథోత్సవాన్ని గురువారం ఆలయ నిర్వాహకులు రాచోటి రామయ్య ఆధ్వర్యంలో అశేష జనవాహిని మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. డోలు, సన్నాయి, భాజాభజంత్రీల మధ్య భక్తులు 'లక్ష్మమ్మవ్వకు జై' నామస్మరణ చేయగా రథోత్సవం ముందుకు సాగింది. వెండి రథంపై శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ బంగారు విగ్రహాన్ని కొలువుదీర్చి పురవీధుల్లో భక్త జనసందోహం మధ్య అవ్వా సేవాసమితి సభ్యులు రథాన్ని లాగారు. దాదాపు 5 గంటల పాటు పురవీధులగుండా రథోత్సవం నిర్వహించగా భక్తులు అవ్వవారిని దర్శించుకున్నారు. రథం ముందు మూసానహళ్లి గ్రామ చిన్నారులు, మహిళలు కలశాలతో ముందుకు సాగారు.

జీడిపప్పు, బాదంతో అలంకరణ

మహాయోగి లక్ష్మమ్మవ్వ విగ్రహానికి తెల్లవారుజామున క్షీరాభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలు, పూల అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా జీడిపప్పు, ఎండుద్రాక్ష, బాదం గింజలతో అవ్వ విగ్రహాన్ని అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వేకువజాము నుంచి రాత్రి 10 గంటల వరకు పట్టణ, గ్రామీణ భక్తులు, కొత్తగా పెళ్లి అయిన జంటలు, అవ్వవారిని దర్శించుకున్నారు.

అన్నదానం ఏర్పాటు

లక్ష్మమ్మవ్వ రథోత్సవం సందర్భంగా ఏటా మాదిరిగానే దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి ఆలయ నిర్వాహకులు ప్రధాన రహదారుల్లో అవ్వ ఆలయం ముందు డేరా వేసి భక్తులకు అన్నదానం చేపట్టారు. డీఎస్పీ శివనారాయణస్వామి దంపతుల చేతులమీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే అల్కూరు మఠం మహర్షి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక సంతపేటలో అవ్వను దర్శించుకుని వస్తున్న భక్తులకు ప్రత్యేక వంటకాలతో భోజనం వడ్డించారు. అదేవిధంగా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, తాగునీరు అందించారు.

భారీ బందోబస్తు

రథోత్సవంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. అలాగే సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేశారు. స్పెషల్ పార్టీ పోలీసులు, ఎస్‌ఐలు, సీఐలు, కానిస్టేబుళ్లతో బందోబస్తు నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ ధీరజ్, సీఐలు తేజమూర్తి, గోపి, నరసింహరాజు, మంజునాథ్, విజయలక్ష్మి, నిరంజన్‌రెడ్డి విధుల్లో పాల్గొన్నారు.